క్లుప్తంగా

నేడు సహస్ర తులసీ దళార్చన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

23న జీవీఎంసీ జోన్-4 దుకాణాలకు వేలం

అల్లిపురం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ 4వ జోన్‌కు సంబంధించిన దుకాణాలు, కళ్యాణ మండపాలు, క్యాంటీన్‌కు 23వ తేదీ ఉదయం 11 గంటలకు 4వ జోన్ కార్యాలయంలో బహిరంగ వేలం వేయనున్నట్లు జోనల్ కమిషనర్ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు నిర్ణీత తేదీలో జోనల్ కార్యాలయంలో జరుగు వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు. పూర్తి వివరాలకు జోనల్ కార్యాలయం పనివేళల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు పర్యవేక్షణ అధికారిని సంప్రదించాలని తెలిపారు.

గోతులు పూడ్చండి



ప్రమాదకర గోతులను పరిశీలిస్తున్న వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం వార్డులో పర్యటించారు. గత కొద్ది నెలల క్రితం పైపులైన్ల కోసం గోతులు తవ్వి సరిగ్గా పూడ్చకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు నాయకులకు తెలిపారు. పలు వీధుల్లో గోతులు అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని నాయకులు గుర్తించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ జోన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో కోరాడ శౌరీ, మామిడి మోహన్, ఆనంద్, కమల్, కుమార్, ఆకుల శ్యామ్, రాజాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జీవో 84పై అవగాహన



జీవో 84పై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో హుస్సేన్

మురళీనగర్: నగరంలోని యూఎల్‌సీ భూముల్లో భవనాలు నిర్మించుకుని నివసిస్తున్న వారితో పాటు ఖాళీ స్థలాల్లో డీ పట్టాల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 84పై ఆర్డీవో హుస్సేన్ అవగాహన కల్పించారు. 49, 50 వార్డులకు సంబంధించి సత్యనగర్-1లో స్థానికులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ సమక్షంలో ఆయన స్థానికులకు వివరాలు తెలియజేశారు. 150 గజాల వరకు డీపట్టా ఉచితంగా అందిస్తామన్నారు. 151 నుంచి మూడు 300 గజాల వరకు మార్కెట్ విలువపై 15 శాతం, 301 నుంచి 500 గజాల వరకు 30 శాతం, 500 దాటితే వంద శాతం మార్కెట్ విలువ చెల్లించాల్సి ఉంటుందన్నారు. దీనికి సంబంధించి సర్వే జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాలపట్నం తహసీల్దార్, స్థానిక వీఆర్వో పాల్గొన్నారు.

అస్తవ్యస్తం

- పాతనగరంలో శిథిలమైన రహదారులు
- కల్వర్టులదీ అదే దుస్థితి
- భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ కేబుల్ పనుల కోసం తవ్విన గోతులు పూడ్చని వైనం
- ఇబ్బంది పడుతున్న స్థానికులు



ఇలా అయితే ప్రమాదాలు జరగవా?



రెల్లివీధి మెయిన్‌రోడ్డు దుస్థితి



ప్రభుత్వ విక్టోరియా (ఘోషా) ఆసుపత్రి వద్ద ఇలా..



మట్టా వెంకటప్పవారి వీధిలో ఇలా..

దాబాగార్డెన్స్: పాతనగరంలోని పలు వీధుల్లో గల సీసీ రోడ్లతో పాటు కల్వర్టులపై వేసిన సిమెంటు పలకలు శిథిల స్థితికి చేరుకున్నాయి. దీంతో వాహనచోదకులు, పాదచారులు ఇక్కట్లు పడుతున్నారు. ఇవన్నీ పదేళ్ల క్రితం వేసిన రహదారులు. మూడేళ్ల క్రితం వేసిన పలకలు కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. దీనికి తోడు భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ కేబుల్ వ్యవస్థ కోసం ఎక్కడికక్కడ గోతులు తవ్వి వదిలేయడంతో రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. తవ్వి వదిలేసిన గోతులను సిమెంటుతో పూడ్చడం, దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టడం, శిథిలమైన పలకల స్థానంలో కొత్తవి అమర్చకపోవడంతో సమస్య మరింత జటిలంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో చీకట్లో అడుగుతీసి అడుగు వేయడం ఆయా ప్రాంత వాసులకు కష్టంగా మారింది. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా కింద పడి గాయాలపాలవుతున్నారు. ఇక ద్విచక్రవాహన చోదకుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. వాహనాలు గోతుల్లో పడటం వల్ల వారు వెన్నెముక సమస్యలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. జీవీఎంసీ అధికారులు.. ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి పాత నగర వీధుల్లోని రహదారులపై దృష్టి సారించి ప్రజల కష్టాలు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

అడుగడుగునా గోతులే

పాతనగరంలోని దాదాపు అన్నివీధుల్లోని సీసీ రోడ్లు శిథిలావస్థకు చేరుకుని అడుగడుగునా గోతులు పడ్డాయి. సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం కనిపించడం లేదు. జీవీఎంసీ అధికారులు తగిన చర్యలు తీసుకుని కొత్త రోడ్లు నిర్మించాలి

– ఇమంది అప్పారావు, పాతనగరం.

తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి

ఈ వీధుల్లో చీకటి సర్వసాధారణం అయిపోవడంతో వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. పెద్ద వాహనాలు ప్రయాణించేందుకు వీలు కావడం లేదు. కొత్త రోడ్లు వేసి ప్రమాదాలు నివారించాలి. ముఖ్యంగా భూగర్భ విద్యుత్ కేబుళ్ల కోసం తవ్వి వదిలేసిన గోతులను రోజులు గడుస్తున్నా పూడ్చకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

– సీహెచ్ పోతురాజు, ఫిషింగ్ హార్బర్ రోడ్డు

కొత్త రోడ్లు వేస్తున్నాం..

పాతనగరంలో సీసీ రోడ్ల నిర్మాణం మొదలయింది. శిథిలావస్థకు చేరుకున్న రోడ్ల స్థానంలో కొత్తవి నిర్మిస్తున్నాం. శిథిలమైన సిమెంటు పలకల స్థానంలో కొత్తవాటిని త్వరలోనే అమర్చుతాం.

– సత్యనారాయణ, జీవీఎంసీ ఏఈ

40 ఏళ్ల సమస్యకు పరిష్కారం

- పోర్టు నుంచి రహదారిని స్వాధీనం చేసుకున్న జీవీఎంసీ
- పాతనగర వాసుల హర్షం

సాక్షి ఎఫెక్ట్..



రోడ్డుకు అడ్డంగా ఐరెన్ పోల్స్ వేయిస్తున్న కార్పొరేటర్ సాథిక్

జగదాంబ : పాతనగరంలో 40 ఏళ్లుగా అపరిష్కృతంగా వున్న సమస్యకు తెర పడింది. జీవీఎంసీ 39వ వార్డు కోటవీధి దరి జీవీఎంసీకి చెందిన రహదారిని విశాఖ పోర్టు వినియోగిస్తుండడంతో గత 40 సంవత్సరాలుగా అక్కడి స్థానికులు పలు అవస్థలు పడుతున్నారు. కాలుష్యం కోరల్లో చిక్కుకుని వివిధ వ్యాధులకు గురవుతున్నామనే ఆందోళన వారిలో ఉంది. ఈ మార్గంలో భారీ వాహనాల రాకపోకల కారణంగా ఇళ్లు కూడా కూలిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో సాక్షి దినపత్రికలో 'పాతనగరం పాట్లు' శీర్షికన ప్రచురితమైన వార్తకు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ స్పందించారు. రహదారిని జీవీఎంసీ ఆధీనంలోకి తీసుకుని, భారీ వాహనాలు రాకుండా ఐరన్ పోల్స్ ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో బుధవారం వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ ఆధ్వర్యంలో ఐరన్ పోల్స్ ఏర్పాటు ద్వారా భారీ వాహనాల రాకపోకలకు అడ్డుకట్ట పడింది. సాక్షి పత్రికలో కథనం ద్వారా సమస్యకు పరిష్కారం లభించడంతో పాతనగర ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ జోన్-4 ఇంజనీర్ల పర్యవేక్షణలో పనులు జరిగాయి.

వేంకటేశ్వరమెట్ట, ఎల్లమ్మతోట సమస్యలు పరిష్కరించండి

కలెక్టర్‌కు ఎమ్మెల్యే వాసుపల్లి వినతి



కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, బొడ్డేటి ప్రసాద్

అల్లిపురం: వెంకటేశ్వరమెట్ట, ఎల్లమ్మతోటలో దేవదాయ శాఖ సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కలెక్టర్ మల్లికార్జునను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఆయన బుధవారం జిల్లా కలెక్టర్‌ను వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్‌తో పాటు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయన 33వ వార్డు పరిధి వెంకటేశ్వరమెట్ట, 31వ వార్డు పరిధి ఎల్లమ్మతోట ప్రాంతాల్లో నివాస గృహాల సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తెలిపారు.

ఇటీవల కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా సమీక్షా మండలి సమావేశంలో ఆ సమస్యపై మాట్లాడినట్లు గుర్తుచేశారు. వెంకటేశ్వరమెట్టపై 150 సంవత్సరాలుగా 500 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. వాటికి ఎటువంటి క్రయ, విక్రయ, గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్లు సమస్య ఉండేది కాదన్నారు. 2003లో అప్పటి ఈవో, చైర్మన్, స్థానికుల మధ్య నెలకొన్న వివాదం కారణంగా సంబంధిత ఈవో రిజిస్ట్రేషన్లు చేయవద్దని ఇచ్చిన లేఖకు స్పందించి రిజిస్ట్రేషన్లు నిలిపివేశారన్నారు. అనంతరం 2018 నుంచి 2021 మధ్య తాను చేసిన ప్రయత్నం మేరకు 53 రిజిస్ట్రేషన్లు జరిగాయని తెలిపారు. తిరిగి మళ్లీ దేవదాయ శాఖ మెలిక పెట్టడంతో రిజిస్ట్రేషన్లు నిలిపివేయటంతో స్థానికులు రిజిస్ట్రేషన్లు కాక పిల్లల చదువులు, పెళ్లిళ్లకు ఇళ్లు అమ్ముకోలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇళ్లు పాతబడటంతో వాటిని తొలగించి కొత్తగా కట్టుకుందామంటే దేవదాయ శాఖ సిబ్బంది వచ్చి అక్కడ బోర్డు పాతేస్తున్నారని తెలిపారు. దీని వలన నిలువ నీడ లేకుండా అయిపోతుందని ఆయన కలెక్టర్‌కు వివరించారు. ఈ మేరకు దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని ఆయన కలెక్టర్ మల్లికార్జునను కోరారు.

పలువురికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



క్యాన్సర్‌తో బాధపడుతున్న మహ్మద్ హనీష్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



గొర్లె శ్రీనివాసరావుకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

దాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రజాదర్బార్‌లో మెడికల్ సాయం కోసం వచ్చిన పలువురి ఇంటికి బుధవారం వెళ్లి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. జీవీఎంసీ 36వ వార్డు గొడారి గోతులు ప్రాంతానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ లియకత్ తల్లి చనిపోయినట్టు 36వ వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు ద్వారా తెలుసుకుని అంత్యక్రియల కోసం తన సొంత నిధుల నుంచి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే అదే వార్డుకి చెందిన ముస్లిం నాయకుడు మహ్మద్ హనీష్ క్యాన్సర్‌తో బాధపడతున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ట్రీట్‌మెంట్ చేయించారు. మందుల ఖర్చుల కింద తన సొంత నిధుల నుంచి రూ.5 వేలు, 33వ వార్డు వేంకటేశ్వర మెట్ట ప్రాంతానికి చెందిన గొర్లె శ్రీనివాసరావుకు జగనన్న ఇంటి పథకంలో ఇళ్లు మంజూరు చేయించడమే గాక శ్రీనివాసరావు ఆర్థిక పరిస్థితి బాగు లేనందున రూ.5 వేలు, 41వ వార్డు మేనుయేల్ వీధికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఆకుల శ్యామ్ భార్య రోజారాణి గత కొద్ది రోజులుగా క్యాన్సర్‌తో బాధపడతుండడంతో ఆరోగ్యశ్రీ ద్వారా కేజీహెచ్‌లో వైద్యం చేయించారు. మందుల కోసం రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే 38వ వార్డు టౌన్‌హాల్ ప్రాంతానికి చెందిన పుక్కళ్ల కృష్ణవేణి భర్త లేని కారణంగా జీవనోపాధి లేక ముగ్గురు పిల్లలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా రూ.2500 అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, పార్టీ అధ్యక్షులు మాసిపోగు రాజు, దశమంతుల మాణిక్యాలరావు, పార్టీ నాయకులు కోడిగుడ్ల శ్రీధర్, ముత్తాబత్తుల రమేష్, బొడ్డేటి ప్రసాద్, పాల శ్రీహరిరెడ్డి, బొర్రా శ్రీనివాసరెడ్డి, అనురాధ, మోహన్, శ్యామ్‌కుమార్, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో కంప్యూటర్లు ప్రారంభం



సచివాలయంలో కంప్యూటర్లను ప్రారంభిస్తున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట : కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన మూడు కంప్యూటర్లను జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల ఇన్‌చార్జి పూర్ణిమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సలీం నవలలు సమాజ దర్పణాలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

సీతంపేట: పౌర గ్రంథాలయంలో సహృదయ సాహితీ ఆధ్వర్యంలో బుధవారం ప్రముఖ రచయిత సలీం రచించిన 'రెండు ఆకాశాల మధ్య' పుస్తక పరిచయ సభ జరిగింది. సభాధ్యక్షుడు సహృదయ సాహితీ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ సలీం నవలలు సమాజ దర్పణాలు అని కొనియాడారు. సలీం రచించిన 29 నవలల్లో కాలుతున్న పూలతోటకి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిందని గుర్తు చేశారు. రెండు ఆకాశాల మధ్య నవలలో భారత్, పాకిస్తాన్ సరిహద్దు గ్రామాల ప్రజల దుర్భర జీవితాలను హృద్యంగా, సజీవంగా తనదైన శైలిలో పొందుపర్చారన్నారు. అనంతరం పుస్తకాన్ని అతిథులతో కలిసి ఆవిష్కరించారు. రచయిత కె.జి.వేణు మాట్లాడుతూ దేశ విభజన సమయంలో జరిగిన దారుణమైన నరమేధాన్ని చిత్రీకరించిన గొప్ప నవలగా అభివర్ణించారు. ప్రముఖ రచయిత ఎల్.ఆర్.స్వామి మాట్లాడుతూ సలీం రచనలు అందరినీ చదివింపజేస్తాయని, అనేక ఇతర భాషల్లో అనువదించారన్నారు. రచయిత ఆదూరి వెంకట సీతారామమూర్తి, సీహెచ్ చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణమూర్తి, డి.వి.సూర్యారావు, ద్విభాష్యం రాజేశ్వరరావు, అర్నాద్, మేడా మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లారీ యజమానుల నిరసన

కంచరపాలెం: ప్రభుత్వం పెంచిన రోడ్ ట్యాక్స్ (క్వార్టర్లీ ట్యాక్స్)ను వెంటనే రద్దు చేయాలంటూ విశాఖ లారీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శీలానగర్ లారీ యార్డ్‌లో బుధవారం నిరసన చేపట్టారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కేవీఎస్ మూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 31 ప్రకారం రవాణా వాహనాల రోడ్‌ట్యాక్స్‌ను 28 శాతం పెంచడం దారుణమన్నారు. పెద్దమొత్తంలో పెంచి అమలు చేస్తున్న గ్రీన్ ట్యాక్స్ రుసుమును తగ్గించాలని ఆయన కోరారు. సంక్షోభంలో ఉన్న రవాణా రంగాన్ని రక్షించాలన్నారు. తమ డిమాండ్‌పై పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రవాణా రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎం.బాపిరాజు, కార్యదర్శి పి.వెంకటరాజు, కోశాధికారి కె.కాశీవిశ్వనాథ్, లారీ యాజమానులు, లారీ డ్రైవర్లు, క్లీనర్లు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు జగనన్న ఆర్థికసాయంపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న రహ్మతుల్లా బేగ్

దాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ హజ్ యాత్రికులకు జగనన్న అందిస్తున్న ఆర్థిక సాయం హర్షించదగ్గ విషయమని యాసీన్ హజ్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి రహ్మతుల్లా బేగ్, అధ్యక్షుడు మహ్మద్ అహ్మదుల్లా ఖాన్ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సంవత్సరం విజయవాడ గన్నవరం నుంచి హజ్‌కు వెళ్లే యాత్రికులకు సెంట్రల్ హజ్ కమిటీ రూ.3 లక్షల 88 వేల 580 చెల్లించాలని, హైదరాబాద్ నుంచి హజ్‌కు వెళ్లే యాత్రికులకు రూ.3 లక్షల 5 వేల 173 చెల్లించాలని నిర్ణయించిందన్నారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణాకు మధ్య వ్యత్యాసం రూ.83 వేల 407 ఉండడం వల్ల ఉప ముఖ్యమంత్రి అమ్జద్ బాషా, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌసుల్ అజామ్ ఢిల్లీ వెళ్లి కేంద్ర పౌర విమాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను, కేంద్ర మైనార్టీ శాఖ మంత్రి స్మృతి ఇరానీతో సమావేశమై విజయవాడ గన్నవరం నుంచి వెళ్లే హజ్ యాత్రికులకు రూ.83 వేల 407 తేడా ఉండడం వల్ల ఆ ఖరీదును తగ్గించాలని వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కానీ అటు నుంచి ఎటువంటి జవాబు రాకపోవడంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా కలుగజేసుకుని విజయవాడ గన్నవరం నుంచి వెళ్లే యాత్రికులకు రూ.80 వేలు చొప్పున 1,814 మంది హాజీలకు నేరుగా వారి ఖాతాల్లో జమ చేసి, మరోసారి ముస్లిం మైనార్టీల పక్షపాతిగా నిరూపించుకున్నారని కొనియాడారు. ఇదిలా ఉండగా సొసైటీ ద్వారా వచ్చే శనివారం ఉత్తరాంధ్ర ఐదు జిల్లాల నుంచి హజ్ యాత్రికు వెళ్లే హాజీలకు ప్రభుత్వం తరఫున వ్యాక్సినేషన్ వేయడంతో పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. సుమారు 130 మంది హజ్ యాత్రకు వెళ్తున్నారని, వీరంతా జూన్ 12, 14 తేదీల్లో వెళ్తున్నట్టు చెప్పారు. సమావేశంలో జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ షరీఫ్, ఎంఏ రజాక్, ఎస్ బాషా, షేక్ హరూన్, మహబూబ్‌ఖాన్, హుస్సేన్ సత్తార్, మహ్మద్ అక్బర్ బాషా, అహ్మద్ వల్లీ, షేక్ బుకారి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లవేళలా పరిశుభ్రంగా వార్డులు

- యుద్ధప్రాతిపదికన వ్యర్థాల తరలింపు
- జెడ్సీలకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం



పీ అండ్ టీ కాలనీలో పర్యటిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

సీతమ్మధార: వార్డుల్లో చెత్త కుప్పల నిల్వలు లేకుండా యుద్ధప్రాతిపదికన డంపింగ్ యార్డుకు తరలించాలని జోనల్ కమిషనర్లను జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్‌వర్మ ఆదేశించారు. సీతమ్మధార, పీ అండ్ టీ కాలనీ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులోని డంపర్ బిన్ల చుట్టూ వ్యర్థాలు పేరుకుపోతున్నాయని, వాటిని వెంటనే తొలగించాన్నారు. డోర్ టూ డోర్ చెత్త సేకరిస్తుతున్నప్పుడు డస్ట్ బిన్లలోకి ఎలా చేరుతోందని ఆరా తీశారు. పారిశుధ్య కార్యక్రమాల్లో పుష్ కార్ట్ ద్వారా చెత్తను నేరుగా క్లాప్ వాహనానికి అందించేలా చూడాలని సూచించారు. సచివాలయం పరిధిలో శానిటరీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి వార్డులో వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. సీన్ పాయింట్ వారీగా పారిశుధ్య కార్మికులను సర్దుబాటు చేసుకొని రోడ్లు, కాలువలను శుభ్రపరచాలని సూచించారు. స్థానిక మయూరి కల్యాణ మండపం పక్క వీధిలో చెత్త ఎక్కువగా పేరుకుపోవడంతో దానిని వెంటనే పారిశుధ్య కార్మికులచే ఎత్తించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలని ఆదేశించారు. అక్కయ్యపాలెం – దొండపర్తి ప్రధాన రహదారిని ఉదయం 6 గంటల నుంచి కార్మికులచే శుభ్రం చేయించాలని కమిషనర్ ఆదేశించారు. బీచ్ రోడ్డులోని సాగర్‌నగర్, రుషికొండ వరకు పర్యటించి జంక్షన్ల అభివృద్ధి, సుందరీకరణ పనులు ఏవిధంగా చేస్తే బాగుంటుందని పరిశీలించారు. సాగర్‌నగర్‌లో మరుగుదొడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పర్యటనలో జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్లు రవికృష్ణ రాజు, చీఫ్ సిటీ ప్లానర్ బి.సురేష్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ కె.వి.ఎన్.రవి, కార్యనిర్వాహక ఇంజినీర్ మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఆర్థిక ప్రగతే ప్రభుత్వ లక్ష్యం

మేయర్ గొలగాని హరివెంకటకుమారి



నూతన వాహనాలతో మేయర్ హరివెంకటకుమారి, అధికారులు

తాటిచెట్లపాలెం: జోన్-5 పరిధిలోని పారిశుధ్య కార్మికుల కోసం నూతనంగా సమకూర్చిన వాహనాలను బుధవారం తాటిచెట్లపాలెంలోని మినీ సూయేజ్ ఫాం-5లో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ) సహకారంతో నమస్తే స్కీం ద్వారా పారిశుధ్య కార్మికులకు రాయితీపై రెండు ప్రొక్లెయిన్లు, ఒక సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్ వాహనాన్ని అందజేసినట్లు చెప్పారు. వాహనాల రాయితీని ఏడేళ్ల పాటు జీవీఎంసీ చెల్లిస్తుందని, దీని ద్వారా పారిశుధ్య కార్మికుడికే లబ్ధి చేకూరుతుందన్నారు. తద్వారా కార్మికులు ఆర్థికంగా బలోపేతమవుతారని మేయర్ తెలిపారు. ఐదుగురు పారిశుధ్య కార్మికులు గ్రూపుగా ఏర్పడి ఒక్కో వాహన నిర్వహణ బాధ్యతను చూసుకుంటారని, ప్రధాన గెడ్డల్లో పూడికలు తీసేందుకు వీటిని వినియోగిస్తామని తెలిపారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ఏఎంవోహెచ్ డాక్టర్ రాజేష్, కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఆంగ్లభాషపై పట్టు అవసరం



వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

సింహాచలం: ఆంగ్లభాషపై విద్యార్థులు పట్టు సాధించాలని గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వర్లు సూచించారు. అడవివరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో బుధవారం విద్యార్థులకు ఆంగ్లభాష ఆవశ్యకత-భాషపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులంతా ఆంగ్లభాషపై పట్టు సాధించాలని తెలియజేశారు. చదవడం, వినడం, ఇతరులతో చర్చించడం ద్వారా ఆంగ్లభాషలో ప్రావీణ్యం సాధించవచ్చన్నారు. గ్రంథాలయ రీడర్స్ ఫోరం అధ్యక్షుడు బి.బి.రాజేంద్రప్రసాద్ గేయాలు, నీతికథలు చెప్పారు. కార్యక్రమంలో కార్మిక నేత జి.సూర్యనారాయణరాజు, గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం, ఉద్యోగి యల్లమ్మ, పాఠకులు భానుమూర్తి, బి.సూర్యమోహన్, పి.లక్ష్మణ్, ఎం.అజయ్, జి.వరలక్ష్మి, కె.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రహిత నగరానికి సహకారం



ప్రచారం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార: గంజాయి రహిత నగరానికి ఆటో డ్రైవర్లు సహకరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జి.వామనమూర్తి, జిల్లా సమితి సభ్యుడు పడాల గోవింద్ కోరారు. సీతమ్మధారలో బుధవారం ఆటో డ్రైవర్ల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంత విశాఖలో యువతీ, యువకుల ప్రాణాలతో చెలగాటమాడే గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల నియంత్రణకు పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ ధరలు రద్దు చేయాలని, ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. పోలీసులు, ఆర్టీవో అధికారులు ఇస్తున్న ఈ-చలానాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రావికృష్ణ, హరి, రాజు, రమణ, ప్రసాద్, ముత్యాలనాయుడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ ఫ్రిజ్‌లకు ఏడాది



కమ్యూనిటీ ఫ్రిజ్‌లోని ఆహారాన్ని పేదలకు అందిస్తున్న నూకల శేషగిరిరావు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ ఫ్రిజ్‌లకు బుధవారంతో ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు మాట్లాడుతూ 13 ఏళ్లుగా భక్తులు, పేదలకు నిత్యాన్నదానం ద్వారా ధ్యాన మందిరం సేవలందిస్తోందని తెలిపారు. ప్రతి రోజు యాచకులు, నిరుపేదలు సుమారు 100 మంది వరకు, గురువారాల్లో 200 మంది వరకు అన్నదానంలో పాల్గొంటున్నారన్నారు. ధ్యాన మందిర సేవలను గుర్తించిన ఇంటర్నేషనల్ వైశ్ ఫెడరేషన్ ఆర్థిక సాయంతో రెండు కమ్యూనిటీ ఫ్రిజ్‌లను గతేడాది మే 18న సమకూర్చింది. వీటి ద్వారా ఇక్కడ ఆహారాన్ని 24 గంటలూ అందుబాటులో ఉంచుతున్నారు. ఏ సమయంలోనైనా ఆకలితో ఉన్న వారు వచ్చి ఈ ఆహారాన్ని తీసుకుంటున్నారు. ప్రతి రోజు సుమారు 50 నుంచి 100 మందికి భోజనాలను ప్యాకెట్ల రూపంలో ఈ ఫ్రిజ్‌లలో ఉంచుతున్నామని మందిర వ్యవస్థాపకులు తెలిపారు.